సాక్షి ఆదిలాబాద్

శనివారం : 25 ఫిబ్రవరి 2023



మళ్లీ పులులొచ్చాయ్

10లో ▸

జిల్లాలో మళ్లీ పులుల సంచారం గుబులు రేపుతోంది. మూడు నెలల క్రితం ఎక్కడైతో నాలుగు కనిపించాయో తాజాగా మళ్లీ ఆ ప్రాంత సమీపంలోనే దర్శనమిచ్చాయి.



గోవిందుడి రథోత్సవం

తలమడుగు మండలం భరంపూర్ గ్రామ సమీపంలోని కొండపైన గల శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయ బహ్మోత్సవాలు ముగిశాయి. శుక్రవారం గోవిందుడి రథోత్సవం నేత్రపర్వంగా సాగింది.

8లో ▸

గరిష్టం/కనిష్టం
37.0/18.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. పగటి ఉష్ణోగ్రత పెరగనుంది. మధ్యాహ్నం ఉక్కపోత అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

నేడు 'డయల్ యువర్ డీఎం'

ఆదిలాబాద్: ఆదిలాబాద్ ఆర్టీసీ డిపో పరిధిలో శనివారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డీఎం కల్పన ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజలు తమ సమస్యలతో పాటు సలహాలు, సూచనలు కూడా చేయవచ్చని పేర్కొన్నారు. మధ్యాహ్నం 12నుంచి ఒంటి గంట వరకు కొనసాగే ఈ కార్యక్రమంలో పాల్గొనదలచిన వారు 99592 26002 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో శనగ కొనుగోళ్లు

- క్వింటాల్‌కు రూ.5,235
- డీఎం గౌరీ నాగేశ్వర్

కైలాస్‌నగర్: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు క్వింటాల్‌కు రూ.5,235 మద్దతు ధరతో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ప్రాథమిక సహకార సంఘాల ద్వారా శనగలను కొనుగోలు చేయనున్నట్లు జిల్లా మార్క్‌ఫెడ్ డీఎం గౌరీ నాగేశ్వర్ ప్రకటనలో తెలిపారు. ఇందుకోసం జిల్లా వ్యాప్తంగా ఎనిమిది కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. రైతులు మద్దతు ధర కంటే తక్కువకు బహిరంగ మార్కెట్లో అమ్మి నష్టపోవద్దన్నారు. శనగలను ఆరబెట్టి, శుభ్రపరచి గ్రామాల వారీగా కేటాయించిన షెడ్యూల్ ప్రకారం యార్డుకు తీసుకువచ్చి మద్దతు ధర పొందాలని సూచించారు. తేమశాతం 14కు మించి ఉంటే సరుకును కొనుగోలు చేసే వీలుండదని పేర్కొన్నారు. మార్చి మొదటి వారంలో శనగ కొనుగోలు కేంద్రాలను ప్రారంభించనున్నట్లుగా ఆయన వెల్లడించారు.

దరఖాస్తుల స్వీకరణ

కైలాస్‌నగర్: 2022–23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ప్రీమెట్రిక్ స్కాలర్‌షిప్ మంజూరు కోసం దివ్యాంగ విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా మహిళా, శిశు, దివ్యాంగుల సంక్షేమశాఖ అధికారి మిల్కా ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన, ఎయిడెడ్ పాఠశాలల్లో 1నుంచి పదో తరగతి చదువుతున్న దివ్యాంగ విద్యార్థులు http:// telanganaepass. cgg. gov. in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వాటి హార్డ్‌కాపీలను సంబంధిత ప్రిన్సిపల్, ప్రధానోపాధ్యాయుల ద్వారా ఈ నెల 28లోపు జిల్లా కేంద్రంలోని తమ కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న క్షమాదేశ్‌పాండే

ఆదిలాబాద్‌టౌన్: చట్టాలపై ప్రతీ ఒక్కరికి అవగాహన అవసరమని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి క్షమాదేశ్‌పాండే అన్నారు. జిల్లా కేంద్రంలోని సంజయ్‌నగర్‌లో గల అర్బన్ కేజీబీవీలో ఉమెన్ ట్రాఫికింగ్‌పై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. మహిళలు, యువతుల అక్రమ రవాణా జరగకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. అక్రమ రవాణకు గురైతే డయల్ 100, 1098, 181, 139 నంబర్లకు సమాచారం ఇవ్వాలని సూచించారు. దీంతో వెంటనే రక్షణ పొందవచ్చని పేర్కొన్నారు. విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అలాగే కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో పీపీ రమణారెడ్డి, సీడబ్ల్యూసీ చైర్మన్ వెంకటస్వామి, టూటౌన్ సీఐ పురుషోత్తంచారి, సెక్టోరియల్ అధికారి ఉదయశ్రీ, కేజీబీవీ ప్రత్యేకాధికారి దీప్తి, సఖీ కేంద్రం నిర్వాహకురాలు సరస్వతి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నగేశ్ తదితరులు పాల్గొన్నారు.

పెంచిన వేతనాలు చెల్లించాలని ఆందోళన



నినాదాలు చేస్తున్న కార్మికులు

ఎదులాపురం: పెంచిన వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ రిమ్స్ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులు శుక్రవారం ఆందోళన చేపట్టారు. రిమ్స్ డైరెక్టర్ చాంబర్ ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. జీవో 60 ప్రకారం వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నా ఎనిమిది నెలలుగా నూతన కాంట్రాక్టర్ స్పందించడం లేదన్నారు. సమస్యను డీఎంఈ దృష్టికి తీసుకెళ్తే పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు కానీ ఇంత వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. అనంతరం సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రిమ్స్ డైరెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. వారం రోజుల్లో పరిష్కరించని పక్షంలో ఆందోళనలు తీవ్రతరం చేస్తామన్నారు. కార్యక్రమంలో కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులు ఉమ, ఖలీల్, సురేందర్ పాల్గొన్నారు.



భోరజ్ చెక్‌పోస్టు వద్ద లారీలు

ఆగిన ఆమ్యామ్యాలు!

- భోరజ్ చెక్‌పోస్టులో అక్రమ లావాదేవీలు బంద్
- వారం రోజులుగా 'ఆ సొమ్ము' అంటేనే జడుస్తున్న ఎంవీఐలు
- సీనియర్ ఎంవీఐ బెదిరింపుల ఎఫెక్ట్
- తోడైన ఏసీబీ, విజిలెన్స్ దాడుల భయం

సాక్షి,ఆదిలాబాద్: భోరజ్ రవాణ శాఖ చెక్‌పోస్టు.. జాతీయ రహదారి 44నకు ఆనుకొని ఉంటుంది. ఈమార్గం గుండా వెళ్లే భారీ వాహనాలకు సంబంధించి పర్మిట్, ఓవర్‌లోడ్, లైసెన్సులు, టాక్స్‌లు, ఇతరత్రా పత్రాలు సరిగ్గా ఉన్నాయా.. లేదా అనేది చెక్ చేసి పంపాలి. 24 గంటల పాటు ఇక్కడికి వచ్చిపోయే వాహనాల తనిఖీతో సందడి ఉంటుంది. ముఖ్యంగా ఇక్కడ ప్రైవేట్ సిబ్బంది వాటికి సంబంధించిన ప్రక్రియ చేపట్టి లోటుపాట్లు గుర్తించి అక్రమంగా డబ్బులు గుంజడమే విధిగా సాగుతుంటుంది. వీరి తనిఖీల బారిన పడకుండా ఉండాలంటే వాహనదా రులు అక్కడి నుంచి వెళ్లే క్రమంలో అమ్యామ్యాలను సమీపంలో ఏర్పాటు చేసిన ట్రేలో పెట్టి వెళ్లాల్సి ఉంటుంది. అయితే వారం రోజులుగా ఇలాంటి పరిస్థితులేమీ కనిపించడం లేదు. అంతా సైలెంట్ అయిపోయారు. అధికార లావాదేవీలు తప్పితే అనధి కారిక లావాదేవీలన్నీ నిలిచిపోయాయి. ఇప్పుడు ఇక్కడంతా బోసిపోయిన వాతావరణం కనిపిస్తుంది.

ఆ బెదిరింపుల ఎఫెక్ట్..

తనకు అదనంగా డ్యూటీలు కేటాయించాలని, లేనిపక్షంలో ఒక్కో మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ లక్షల రూపాయలు ముట్టజెప్పాలంటూ ఇక్కడ పనిచేస్తున్న సీనియర్ ఎంవీఐ సృష్టించిన హంగామా కారణంగానే పైన పేర్కొన్న ప్రస్తుత పరిస్థితి నెలకొంది. తన మాట కాదని ఇష్టారీతిన వ్యవహరిస్తే మాత్రం ఏసీబీ, విజిలెన్స్ దాడులు చేయిస్తానని బెదిరించడంతో ఇక్కడ పనిచేసే వారందరు హడలెత్తిపోయారు. ఈ పరిస్థితుల్లోనే అక్రమ సొమ్మంటేనే జడుసుకునే పరిస్థితి కనిపిస్తుంది. మళ్లీ పరిస్థితులన్నీ చక్కబడితేనే అమ్యమ్యాల వైపు చూద్దామని, అనవసరపు రిస్క్ ఎందుకని వారికివారే నిర్ణయానికి వచ్చారు. తద్వారా కొద్ది రోజులుగా సైలంటై పోయారు. ఇక్కడ పరిస్థితి చూసి నిత్యం ఈ మార్గం గుండా వెళ్లే వాహన డ్రైవర్లు, క్లీనర్లు ఆశ్చర్యపోయే పరిస్థితులు నెలకొన్నాయి. ఇదిలా ఉంటే తన ప్రాబల్యంతో చెక్‌పోస్టు డ్యూటీ ఇతర మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్లు చేయకుండా అడ్డుకుంటున్న సీనియర్ ఎంవీఐ ఈ చెక్‌పోస్టుకు ఆన్ డ్యూటీలను, పూర్తి అదనపు బాధ్యతలను పైనుంచే.. అంటే రాష్ట్రస్థాయి నుంచి ఇక్కడికి కేటాయిస్తున్నప్పుడు ఎందుకు అడ్డుకోలేక పోతున్నారని మిగతా మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్లు ప్రశ్నిస్తున్నారు. రెగ్యులర్ అధికారులు మినహాయించి మిగతా వారు ఇక్కడి నుంచి వెళ్లిపోవాలని బెదిరిస్తున్న సదరు అధికారి మరో జిల్లాలో డీటీఓ అదనపు బాధ్యతలు ఎలా నిర్వర్తిస్తున్నారని మిగతా అధికారులు ప్రశ్నిస్తున్నారు. తనకు ఓ న్యాయం, ఇతరులకు ఓ న్యాయమా అని అంటున్నారు.

పైకి చేరిన సమాచారం..

భోరజ్ చెక్‌పోస్టులో జరుగుతున్న తతంగంపై మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్లు ఇప్పటికే రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి, ఎమ్మెల్యే జోగు రామన్నల దృష్టికి తీసుకెళ్లిన విషయం తెలిసిందే. ఇదిలా ఉంటే రవాణ శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, కమిషనర్ జ్యోతిబుద్ధ ప్రకాశ్ దృష్టికి కూడా చేరింది. ఇదిలా ఉంటే కొద్ది రోజులుగా వ్యవహారం ముదిరినప్పటికీ తాజాగా సదరు సీనియర్ ఎంవీఐ ఇక్కడ స్థానికంగా అందుబాటులో లేరని చెప్పుకుంటున్నారు. పైనుంచి ఏవైనా చివాట్లు వచ్చాయో.. మరేమో కానీ రెండు రోజులుగా సదరు అధికారి సైలెంట్ అయినట్లు చెప్పుకుంటున్నారు. చెక్‌పోస్టు వైపు కూడా రాలేదని అంటున్నారు. ఈ నేపథ్యంలో వ్యవహారం పూర్తిగా సమసిపోయిందా.. లేనిపక్షంలో ఎలా ఉంటుందనేది చూడాల్సిందే.

అభివృద్ధి, సంక్షేమంలో తెలంగాణ ఆదర్శం

- మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి



హైలెవల్ వంతెన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి ఐకేరెడ్డి, ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావ్

నేరడిగొండ: తెలంగాణలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు దేశంలో ఎక్కడా లేవని రాష్ట్ర అటవీ, పర్యావరణ, న్యాయ, దేవాదాయశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. నేరడిగొండ జాతీయ రహదారి నుంచి కుంటాల జలపాతానికి వెళ్లే రహదారిలో సవర్గాం వద్ద రూ.3.30 కోట్లతో నిర్మించనున్న హైలెవల్ వంతెనకు శుక్రవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడా రు. ఉమ్మడి రాష్ట్ర పాలనలో ఎన్ని తిప్పలు పడ్డామో మనందరికీ తెలుసన్నారు. స్వరాష్ట్రం ఏర్పడ్డాక సీఎం కేసీఆర్ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్నారన్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు లో దేశంలోనే తెలంగాణ ఆదర్శంగా నిలుస్తోందన్నారు. ఎనిమిదేళ్లలో రాష్ట్ర ముఖచిత్రమే మారిపోయిందన్నారు. కొంతమంది కేవలం రాజకీయ లబ్ధి కోసమే విమర్శలు చేస్తున్నారని, వారిని పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావ్, జెడ్పీటీసీ అనిల్ జాదవ్, ఎంపీపీ రాథోడ్ సజన్, స్థానిక సర్పంచ్ వెంకటరమణ, బోథ్ ఏఎంసీ చైర్మన్ రుక్మన్‌సింగ్, బీఆర్ఎస్ నాయకులు భోజన్న, నారాయణ సింగ్, భీంరెడ్డి, కిరణ్ కుమార్‌రెడ్డి, మహేందర్, కరణ్‌సింగ్ పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు

మండలంలోని ఆరేపల్లి గ్రామంలో మూడు రోజులుగా కొనసాగుతున్న సంత్ సేవాలాల్ మహరాజ్ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి మంత్రి ఐకే రెడ్డి, ఎమ్మెల్యే బాపూరావ్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బీఆర్ఎస్ సభ్యత్వం కలిగి ప్రమాదవశాత్తు మృతిచెందిన గ్రామానికి చెందిన జాదవ్ సర్దార్ కుటుంబానికి రూ.2లక్షల ఇన్సూరెన్స్ చెక్కును అందజేశారు.

లక్ష్యాలు త్వరితగతిన పూర్తి చేయాలి

- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి



వీసీలో మాట్లాడుతున్న రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి

ఎదులాపురం: ప్రభుత్వ లక్ష్యాలను త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అన్నారు. హైదరాబాద్ నుంచి శుక్రవారం మున్సిపల్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అరవింద్‌కుమార్, రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులతో కలిసి కంటి వెలుగు, పట్టణ ప్రాంతాల్లో డబుల్ బెడ్‌రూం ఇళ్ల ప్రగతి తదితర అంశాలపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా పట్టాలు లేకుండా ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూములు, ఆబాది గ్రామకంఠం, శిఖం, వక్ఫ్, దేవాదాయ భూముల మొదలగు వివరాలను ప్రొఫార్మా–1 ప్రకారం సేకరించాలని, వాటి క్రమబద్ధీకరణకు గల అవకాశం, ప్రాతిపదిక, అనుసరించాల్సిన విధానంపై నివేదిక తయారు చేయాలని సూచించారు. త్వరితగతిన డబుల్ బెడ్‌రూం లబ్ధిదారులను ఎంపిక చేసి వివరాలు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. పోడు భూముల పంపిణీకి సంబంధించి జిల్లా స్థాయి కమిటీ వద్ద పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. ఆయిల్‌పామ్ సాగు లక్ష్యాలను మార్చిలోగా పూర్తి చేయాలన్నారు. ఇందులో కలెక్టర్ రాహుల్‌రాజ్, అదనపు కలెక్టర్లు ఎన్.నటరాజ్, రిజ్వాన్ బాషాషేక్, జిల్లా అటవీ అధికారి రాజశేఖర్, డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్, మున్సిపల్ కమిషనర్ శైలజ, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్, సంబంధిత శాఖ లఅధికారులు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

'డబుల్' లబ్ధిదారుల వివరాలు సమర్పించాలి

- కలెక్టర్ రాహుల్‌రాజ్

ఎదులాపురం: డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాలకు సంబంధించిన లబ్ధిదారుల వివరాలు నిర్ణీత ప్రొఫార్మాలో సమర్పించాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో అదనపు కలెక్టర్‌తో కలిసి తహసీల్దార్లతో శుక్రవారం సాయంత్రం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడా రు. డబుల్ బెడ్‌రూం ఇళ్ల పంపిణీకి లబ్ధిదారుల ఎంపికను ప్రాథమిక విచారణ నిర్వహించి నిర్ణీత ప్రొఫార్మాలో నివేదికలు ఈ నెల 28లోగా సమర్పించాలన్నారు. ఇందులో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, ట్రెయినీ కలెక్టర్ శ్రీజ, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

'పది' విద్యార్థులను దత్తత తీసుకోవాలి

- రాష్ట్ర అబ్జర్వర్ చంద్రశేఖర్‌రెడ్డి



విద్యార్థులతో మాట్లాడుతున్న చంద్రశేఖర్‌రెడ్డి

ఆదిలాబాద్‌టౌన్: పదో తరగతిలో మంచి ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని పదో తరగతి ప్రత్యేక తరగతుల రాష్ట్ర అబ్జర్వర్, ఎస్ఈఆర్టీ ప్రొఫెసర్ చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. జిల్లాలోని పలు ప్రభుత్వ పాఠశాలలను శుక్రవారం తనిఖీ చేశారు. పదో తరగతి విద్యార్థులతో మాట్లాడి ప్రత్యేక తరగతులు, స్నాక్స్ విషయాలపై ఆరా తీశారు. పట్టణంలోని ఆర్పీఎల్, తలమడుగు మండలంలోని కజ్జర్ల, తాంసి మండలంలోని పొన్నారి, కప్పరల, ఆదిలాబాద్ మండలంలోని పొచ్చర పాఠశాలలను సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడారు. విద్యార్థులను ఉపాధ్యాయులు దత్తత తీసుకుని, వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఏ,బీ,సీ గ్రూపులుగా విభజించి సి–గ్రూప్ విద్యార్థులపై ప్రత్యేక చొరవ చూపాలన్నారు. అలాగే ప్రతిరోజు స్లిప్ టెస్టులు నిర్వహించి మూల్యాంకనం చేయాలని, విద్యార్థులు సాధించిన మార్కులను తల్లిదండ్రులకు తెలియజేయాలని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ద్వారా ముద్రించిన లేఖలను పేరెంట్స్‌కు అందజేయాలని సూచించారు. అలాగే ఉదయం, సాయంత్రం వేళల్లో విద్యార్థులకు స్నాక్స్ అందజేయాలని తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించాలని ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. ఆయన వెంట డీఈవో ప్రణీత, సెక్టోరియల్ అధికారి నర్సయ్య, ప్రతాప్, వీరేందర్, రాజేశ్వర్ తదితరులు ఉన్నారు.

నేడు మున్సిపల్ సమస్యలపై 'సాక్షి ఫోన్ ఇన్'

సమయం : ఉదయం 11నుంచి 12గంటల వరకు

సాక్షి ఫోన్ ఇన్



ఏ.శైలజ, మున్సిపల్ కమిషనర్

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ మున్సిపల్ పరిధిలో నెలకొన్న ప్రధాన సమస్యలపై 'సాక్షి' ఆధ్వర్యంలో నేడు మున్సిపల్ కమిషనర్ ఏ.శైలజతో ఫోన్ ఇన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు ఈ కార్యక్రమం కొనసాగనుంది. ఆదిలాబాద్ పట్టణంలో కుక్కలు, పందుల బెడద, తాగునీటి సరఫరాలో అంతరాయం, పారిశుధ్య సమస్య, చెత్త సేకరణలో జాప్యం, వీధి లైట్లు వెలగకపోవడం వంటి సమస్యలపై ప్రజలు 9010201689, 9848890171 నంబర్లకు ఫోన్ చేసి కమిషనర్ దృష్టికి తీసుకురావచ్చు.

కాపీయింగ్ అడ్డుకుంటే.. ఎదురుదాడే!

- జిల్లాలో విద్యార్థుల వింత పోకడ
- డిగ్రీ పరీక్షల్లో ఇటీవల ఓ అబ్జర్వర్ వాహనం ధ్వంసం
- తాజాగా డీఎడ్ పరీక్షల్లో అధికారులతో ఓ విద్యార్థిని వాగ్వాదం
- తండ్రితో ఫోన్ చేయించి మరీ బెదిరింపులు



డీఎడ్ పరీక్ష రాస్తున్న విద్యార్థులు (ఫైల్)

ఆదిలాబాద్‌టౌన్: కష్టపడి చదివి పరీక్షలు రాయాల్సిన కొంతమంది విద్యార్థులు మాస్ కాపీయింగ్‌నే నమ్ముకుంటున్నారు. అబ్జర్వర్లు, స్క్వాడ్‌లు, ఇన్విజిలెటర్లకు పట్టుబడితే వారితో వాగ్వాదానికి దిగుతున్నారు. జిల్లాలో ఇటీవల ఇలాంటి ఘటనలు చోటు చేసుకోవడం గమనార్హం. తాజాగా డీఎడ్ పరీక్షల్లో ఓ విద్యార్థిని సీఎస్, డీఓలతో పాటు ఇన్విజిలెటర్లతో వాగ్వాదానికి దిగింది. మాస్ కాపీయింగ్‌కు పాల్పడుతుండగా పరీక్షల నిర్వాహకులు ఆమె నుంచి చీటీలు తీసుకున్నారు. దీంతో ఆమె వారిని దూషించింది. పరీక్ష కేంద్రం నుంచి బయటకు వెళ్లాలని చెప్పడంతో తన తండ్రితో ఫోన్ చేయించి బెదిరింపులకు పాల్పడింది. ఈ ఘటన చర్చనీయాంశంగా మారింది. ఇదిలా ఉండగా ఇటీవల జరిగిన డిగ్రీ పరీక్షల్లో మాస్‌కాపీయింగ్‌కు పాల్పడిన విద్యార్థులను అబ్జర్వర్లు డిబార్ చేశారు. దీంతో సదరు విద్యార్థులు వారి కారు అద్దాలను ధ్వంసం చేయడం విదితమే. ఇదే కాకుండా ఆదిలాబాద్ పట్టణంలోని ఓ ప్రభుత్వ కళాశాలలో, ఉట్నూర్‌లో సైతం ఇన్విజిలెటర్లను బెదిరింపులకు పాల్పడటం సర్వసాధారణంగా మారింది.

సెంటర్‌లో జరిగిందిలా..

పట్టణంలోని గెజిటెడ్ నం.1 పాఠశాలలో డీఎడ్ ప్రథమ సంవత్సరం పరీక్షలు కొనసాగుతున్నాయి. పట్టణంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో చదువుతున్న విద్యార్థిని పరీక్షలకు హాజరైంది. మాస్ కాపీయింగ్‌కు పాల్పడుతుండగా గమనించిన సెంటర్ నిర్వాహకులు ఆమె నుంచి చీటీలు తీసుకున్నారు. బయట నిలబడాలని సూచించారు. దీంతో ఆమె కోపంతో రగిలిపోయింది. 'నేనెవరో తెలుసా.. ఓ అధికారి కూతురును. నన్నే బయటకు పంపిస్తారా.. ఎంత ధైర్యం..' అంటూ బయటకొచ్చి సెల్‌ఫోన్ ద్వారా తన తండ్రికి విషయం చెప్పింది. విద్యార్థి సెల్‌ఫోన్‌తో పరీక్షల నిర్వాహకులతో మాట్లాడించింది. ఆమె తండ్రి (డీఆర్డీఏలో పనిచేస్తున్న ఓ అధికారి) మాట్లాడుతూ.. 'మీరు పరీక్షల్లో కాపీయింగ్ చేయకుండానే పాసయ్యారా.. నా బిడ్డను డిబార్ చేసే దమ్ముందా.. డీఈవో ఆఫీసు నుంచే నాకు పర్మిషన్ ఉంది.. అసలు మీరేమనుకుంటున్నారంటూ..' బెదిరింపులకు పాల్పడ్డాడు. ఆ తర్వాత తనకు పరిచయం ఉన్న డీఈవో కార్యాలయంలో పనిచేసే ఓ ఉద్యోగితో మాట్లాడి పరీక్ష రాసేలా చూడాలని తెలిపాడు. ఇదిలా ఉండగా చూచిరాస్తూ పట్టుబడ్డ విద్యార్థే నిర్వాహకులు తనకు సారీ చెప్పాలని పట్టుబడటం గమనార్హం. ఈ విషయాన్ని పరీక్షల నిర్వాహకులు డీఈవో కార్యాలయ పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన పరీక్ష కేంద్రానికి చేరుకున్నారు. ఆ విద్యార్థిని సముదాయించి పరీక్ష రాయించారు.

కాపీయింగ్‌కు ప్రోత్సహిస్తున్న ప్రైవేట్ యాజమాన్యాలు..?

పరీక్షలు సజావుగా సాగేలా ప్రభుత్వం అబ్జర్వర్లు, ఇన్విజిలెటర్లను నియమిస్తోంది. అయితే కొన్ని ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులను ప్రలోభాలకు గురిచేస్తున్నాయి. చదవకపోయినా మాస్‌కాపీయింగ్‌తో పాస్ చేయిస్తామని చెబుతున్నాయి. దీంతో వారి మాయలో పడి కొంతమంది విద్యార్థులు చదవకుండా కాపీయింగ్‌కు అలవాటు పడి పోయారు. కొన్ని ప్రైవేట్ కళాశాలల నిర్వాహకులు పరీక్షకు రూ.200 చొప్పున డబ్బులు తీసుకుంటున్నట్లు ఆరోపణలున్నాయి. అయితే పరీక్షల్లో మాస్‌కాపీయింగ్ జరగకుండా పకడ్బందీగా నిర్వహించిన ఇన్విజిలెటర్లు, నిర్వాహకులపై కొందరు విద్యార్థులు అసభ్య పదజాలంతో దూషించడం, బెదిరింపులకు పాల్పడిన ఘటనలు ఇటీవల జిల్లాలో చోటుచేసుకున్నాయి. కొన్ని డిగ్రీ కళాశాలలు, మరికొన్ని డీఎడ్ కళాశాలల్లో తరగతులు జరగకపోవడం, లెక్చరర్లు సరైన రీతిలో వారికి విద్యాబోధన చేయకపోవడంతో విద్యార్థులు పక్కదారి పడుతున్నట్లు తెలుస్తోంది. ఏడాది పాటు కళాశాలకు రానప్పటికీ హాజరు కోసం డబ్బులు చెల్లించి తీరా పరీక్షలకు హాజరవుతున్నారు. పరీక్షల్లో కాపీయింగ్ జరిగితే సంతోషంలో ఉంటున్న కొందరు, జరగని సమయంలో ఇలా వెకిలిచేష్టలకు పాల్పడుతున్నారు. పరీక్ష నిర్వాహకులకు పట్టుబడితే బతిమిలాడాల్సింది పోయి వారిని బెదిరింపులకు గురిచేస్తున్నారు. దీంతో వీరి తీరుపై పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు. గడిచిన మూడు రోజులుగా జిల్లాలో డీఎడ్ పరీక్షలు సాగుతున్నాయి. ఆదిలాబాద్ పట్టణంతో పాటు ఉట్నూర్‌లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటిలో మాస్‌కాపీయింగ్ జోరుగా సాగుతున్నట్లు సమాచారం.

పకడ్బందీగా నిర్వహిస్తున్నాం..

డీఎడ్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహిస్తున్నాం. మాస్‌కాపీయింగ్ జరగకుండా చర్యలు చేపడుతున్నాం. ఆదిలాబాద్ పట్టణంలోని పరీక్ష కేంద్రంలో జరిగిన విషయం నా దృష్టికి రాలేదు. విషయాన్ని తెలుసుకుంటాను. విద్యార్థులు కష్టపడి చదివి పరీక్షలు రాయాలి. మాస్‌కాపీయింగ్‌పై ఆధారపడొద్దు. డిబార్ అయితే నష్టపోవాల్సి వస్తుంది. – ప్రణీత, డీఈవో

మున్సిపల్ ఆదాయం పెంచాలి



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

- ప్రణాళికలు సిద్ధం చేయాలి
- వీధి కుక్కలతో ప్రజలకు ఇక్కట్లు లేకుండా చర్యలు చేపట్టాలి
- అధికారులకు కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆదేశం

కైలాస్‌నగర్: మున్సిపల్ ఆదాయాన్ని పెంచే మార్గాలతో ప్రణాళికలు సిద్ధం చేయాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులను ఆదేశించారు. తన కార్యాలయ చాంబర్‌లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రిజ్వాన్ బాషాతో కలిసి ఆదిలాబాద్ మున్సిపల్ బడ్జెట్, ఆదాయ మార్గాల పెంపు తదితర అంశాలపై శుక్రవారం సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. మున్సిపల్ పరిధిలోని ప్రాపర్టీ టాక్స్ వసూళ్లు, ఖాళీ స్థలాలపై పన్ను, షాపింగ్ కాంప్లెక్స్, వినోదం, ప్రచారం, భవన నిర్మాణాల అనుమతులు తదితర అంశాలపై పన్ను వసూళ్ల ద్వారా ఆదాయాలను పెంచుకునే విధంగా మార్గాలను ప్రతిపాదించాలని సూచించారు. వివిధ పథకాల కింద ప్రభుత్వం కేటాయించే నిధులు, ప్రత్యేక నిధుల ద్వారా మున్సిపల్ పరిధిలో నిర్వహించే పనులు పూర్తి చేయాలన్నారు. గ్రీన్ బడ్జెట్ కింద 10శాతం నిధులు కేటాయిస్తూ హరిత హారం కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. మెప్మా గ్రూపుల ద్వారా నర్సరీలు ఏర్పాటు చేసి ఆర్నమెంటల్ మొక్కల పెంపకం చేపట్టే విధంగా ప్రోత్సహించాలని సూచించారు. పారిశుధ్య కార్మికులకు అవసరమైన సబ్బులు, యూనిఫాం, కొబ్బరినూనె, షూస్, గ్లాసులు, తదితర వస్తువులు ప్రతీ సంవత్సరం అందజేయాలని ఆదేశించారు. పశు వధశాలను శాస్త్రీయంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పట్టణంలో వీధి కుక్కల వలన ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు.అలాగే పందుల పెంపకం యజమానులతో సమావేశం ఏర్పాటు చేసి పట్టణంలోకి రాకుండా ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. సమావేశంలో ట్రెయినీ అసిస్టెంట్ కలెక్టర్ పి శ్రీజ, మున్సిపల్ కమిషనర్ ఏ.శైలజ, డీఈఈ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వైఎస్‌ఆర్‌ టీపీ ఉమ్మడి జిల్లా పరిశీలకులుగా రాంచందర్‌

ఆదిలాబాద్‌టౌన్‌: వైఎస్‌ఆర్‌ తెలంగాణ పార్టీ ఆదిలాబాద్‌ ఉమ్మడి జిల్లా పరిశీలకులుగా గట్టు రాంచందర్‌రావును నియమిస్తూ వైఎస్‌ఆర్‌ తెలంగాణ పార్టీ అధినేత్రి వైఎస్‌ షర్మిల రెడ్డి తెలిపారని రాంచందర్‌రావు పేర్కొన్నారు. అదే విధంగా వైఎస్‌ఆర్‌ పార్టీ ఆదిలాబాద్‌ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్‌గా ఉన్న బెజ్జంకి అనిల్‌కుమార్‌ను మెదక్‌ జిల్లా పరిశీలకులుగా నియమించారు.

ఆలయ నమూనాను పరిశీలించిన మంత్రి



ఆలయ నమూనా పరిశీలిస్తున్న మంత్రి, ఎమ్మెల్యే, ఆలయ అధికారులు

భైంసా: బాసర ఆలయ పునర్నిర్మాణంపై ప్రభుత్వం దృష్టి సారించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా శృంగేరి పీఠాధిపతుల సూచనలు, సలహాలతో రూపొందించిన ఆలయ నమూనాను మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, ముథోల్‌ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి శుక్రవారం పరిశీలించారు. అలాగే ఆలయ అధికారులు, అర్చకులు కలెక్టర్‌ వరుణ్‌రెడ్డిని కలిసి ఆలయ నమూనాపై చర్చించారు.

వైన్‌ షాప్‌లో చోరీ

ఆదిలాబాద్‌టౌన్‌: పట్టణంలోని తిర్పెల్లిలోని శివగంగ వైన్స్‌లో గురువారం అర్ధరాత్రి 2.15 గంటల సమయంలో చోరీ జరిగింది. గుర్తు తెలియని వ్యక్తి వైన్స్‌ షాపు వెనుక వైపు నుంచి రేకుల షెడ్డు పైకప్పు తొలగించి లోనికి వెళ్లాడు. కౌంటర్‌లోని రూ.6వేల నగదును దోచుకెళ్లాడు. వైన్స్‌షాప్‌ యజమాని కుంటాల రమేష్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. సీసీ కెమెరాలో రికార్డు అయినప్పటికీ స్పష్టంగా కనిపించడం లేదని పోలీసులు తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్‌

నిర్మల్‌టౌన్‌: జిల్లా కేంద్రంలోని ఆదర్శనగర్‌లో పేకాటాడుతున్న పలువురుని శుక్రవారం పోలీసులు అరెస్టు చేశారు. వివరాల ప్రకారం.. ఆదర్శనగర్‌ కాలనీలోని ఓ ఇంట్లో ముగ్గురు పేకాటాడుతుండగా పక్కా సమాచారం అందుకున్న పోలీసులు చేరుకుని పట్టుకున్నారు. అనంతరం వారిని పట్టణ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

ఓలాలో అగ్ని ప్రమాదం



కాలిపోయిన వస్తువులతో బాధితుడు

కుంటాల: మండలంలోని ఓలా గ్రామంలో శుక్రవారం గంగుల ముత్తన్న ఇంటిలో ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదం సంభవించింది. ఫ్రిజ్‌లో మంటలు చెలరేగి ఇంటిలోని విలువైన వస్తువులు కాలిపోయాయి. గ్రామస్తులు, భైంసా అగ్నిమాపక అధికారి చరణ్‌కుమార్‌ సంఘటనా స్థలానికి చేరుకుని మంటలు ఆర్పివేశారు. రూ.లక్షా 50వేల ఆస్తినష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయాడు.

తర్నం వాగులోంచి తాత్కాలిక దారి



తాత్కాలికంగా ఏర్పాటు చేసిన రోడ్డు



తాత్కాలికంగా ఏర్పాటు చేసిన దారిలో వెళ్తున్న వాహనాలు

- చిన్న వాహనాలకు అనుమతి
- ప్రయాణికులకు కొంత ఊరట

జైనథ్‌: మండలంలోని తరోడ బ్రిడ్జి ఈ నెల 19న కుంగిపోవడంతో అప్పటి నుంచి ఈ రహదారి గుండా రాకపోకలు నిలిచిపోయాయి. మొదట్లో బైక్‌లు, పాదచారులను బ్రిడ్జి పై నుంచి అనుమతించారు. బ్రిడ్జి పరిస్థితిని చూసి ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు రాకపోకలను పూర్తిగా నిషేధించారు. బ్రిడ్జికి ఇరువైపులా రోడ్డుకు అడ్డంగా గోడలు నిర్మించి సూచిక బోర్డులు ఏర్పాటు చేశారు. జైనథ్‌, బేల మీదుగా మహారాష్ట్రను ఆదిలాబాద్‌కు కలిపే ఈ రోడ్డు తరోడ వద్ద రాకపోకలు నిలిచిపోవడంతో వాహనదారులు నిరాల, అడ, లాండ సాంగ్వి గ్రామాల గుండా ఆదిలాబాద్‌కు రాకపోకలు చేస్తున్నారు. సింగిల్‌ రోడ్డు కావడం, గుంతలమయంగా ఉండడంతో వాహనదారులకు ఇక్కట్లు తప్పడం లేదు. దీంతో ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు తరోడ బ్రిడ్జి కింద నుంచి వాగు మీదుగా తాత్కాలిక రోడ్డును ఏర్పాటు చేశారు. బైక్‌లు, ఆటోలు, కార్లను అనుమతిస్తుండడంతో కొంత వరకు సామాన్య ప్రజల కష్టాలు తీరినట్లేనని చెప్పొచ్చు. వేసవి కాలం కావడం, వాగులో నీటి ప్రవాహం పెద్దగా లేకపోవడంతో బ్రిడ్జి అందుబాటులోకి వచ్చే వరకూ ఈ రోడ్డు గుండానే రాకపోకలు జరిగే అవకాశం ఉంది. ఏదేమైనప్పటికీ అధికారులు వెంటనే స్పందించి కొత్త బ్రిడ్జిని మంజూరు చేసి కష్టాలు తీర్చాలని ప్రజలు కోరుకుంటున్నారు.

పొంచి ఉన్న ప్రమాదం...

- నిరాల–లాండ సాంగ్వి సింగిల్‌ రోడ్డులో ట్రాఫిక్‌
- తరోడ బ్రిడ్జి మూసివేయడంతో భారీ వాహనాలకు బ్రేక్‌



కంఠ వద్ద బోల్తా పడిన లారీ

జైనథ్‌: మండలంలోని తరోడ బ్రిడ్జిని మూసివేయడంతో నిరాల–లాండ సాంగ్వి పంచాయతీరాజ్‌ రోడ్డులో ట్రాఫిక్‌ పెరిగింది. తరోడ బ్రిడ్జి వెంట ప్రతినిత్యం వందల సంఖ్యలో లారీలు, ఇతర భారీ వాహనాలు మహారాష్ట్ర, ఆదిలాబాద్‌ నడుమ నడుస్తున్నాయి. ప్రస్తుతం తరోడ బ్రిడ్జిని మూసి వేయడంతో నిరాల–లాండ సాంగ్వి రోడ్డు గుండా రాకపోకలు కొనసాగుతున్నాయి. ఈ రోడ్డు ఇరుకుగా, గుంతల మయంగా ఉండడంతో ఒకేసారి రెండు భారీ వాహనాలు వెళ్లే పరిస్థితి లేదు. దీనికి తోడు ఈ రోడ్డు వాహనదారులకు కొత్తది కావడంతో ప్రమాదాలు పొంచి ఉన్నాయి. శుక్రవారం ఆదిలాబాద్‌ నుంచి జైనథ్‌ వైపు సోయా లోడ్‌తో వెళ్తున్న ఓ లారీ కంఠ ఎక్స్‌ రోడ్‌ సమీపంలో బోల్తాపడింది. రోడ్డు కుడివైపు భారీ గుంత ఉండటంతో ప్రమాదం చోటుచేసుకుంది. డ్రైవర్‌ చాకచక్యంగా వ్యవహరించడంతో పెను ప్రమాదం తప్పింది. అంతరాష్ట్రయ రహదారి గుండా వెళ్లే భారీ ట్రాఫిక్‌ ఈ చిన్న రోడ్డు గుండా వెళ్లాల్సి రావడంతో, ఈ రోడ్డు గుండా ప్రయాణం అంటేనే జంకుతున్నారు.

అన్నాచెల్లెళ్ల కళ్లలో వెలుగులు



దుస్తులు అందిస్తున్న తహసీల్దార్‌



కూలర్‌, దుస్తులు అందిస్తున్న యువకులు

- సాయం చేయడానికి ముందుకొస్తున్న దాతలు
- సరుకులు, దుస్తులు, నగదు అందజేత
- వచ్చే నెల నుంచి రేషన్‌ బియ్యం సైతం

సాక్షి స్పందన

దహెగాం: తల్లిదండ్రులు దూరమై అనాథలుగా మారిన అన్నాచెల్లెళ్ల కళ్లల్లో వెలుగులు కనిపిస్తున్నాయి. ఆ నలుగురు అన్నాచెల్లెళ్లపై 'సాక్షి'లో 'అన్న పనిచేస్తేనే..చెల్లెళ్ల కడుపు నిండేది 'అనే శీర్షికన కథనం ప్రచురితం కావడంతో పెద్ద ఎత్తున దాతలు ముందుకొచ్చి సాయం చేస్తున్నారు. మూడో రోజు శుక్రవారం సైతం పలువురు దాతలు వారికి నగదుతో పాటు, దుస్తులు, నిత్యావసర సరుకులు, ఓ కూలర్‌ను అందజేశారు.

రేషన్‌ బియ్యం అందిస్తాం

మండలంలోని చౌక గ్రామానికి చెందిన అనాథలైనా సిడాం రాజు, మమత, దీపిక, దివ్యలకు ఏడాదిగా రేషన్‌ బియ్యం అందడం లేదనే కథనం శుక్రవారం ప్రచురితం కావడంతో తహసీల్దార్‌ మధుకర్‌ స్పందించారు. చిన్నారులను స్థానిక తహసీల్‌ కార్యాలయానికి పిలిపించి వారికి నిత్యావసర సరుకులతో పాటు కార్యాలయ సిబ్బంది కలిసి రూ.5వేల నగదును అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రేషన్‌కార్డు ఉన్నా చిన్నారుల వేలిముద్రలు పడకపోవడంతో రేషన్‌ బియ్యానికి దూరమయ్యారని, ఆధార్‌ కేంద్రానికి పంపించి వేలిముద్రలను అప్‌డేట్‌ చేయిస్తామన్నారు. వచ్చే నెల నుంచి వీరికి రేషన్‌ బియ్యం అందుతాయని తెలిపారు. మమతను దహెగాం కేజీబీవీలో, దీపిక, దివ్యలను కుంటలమానెపల్లి ఆశ్రమ పాఠశాలలో చేర్పిస్తామన్నారు. చిన్నారుల తండ్రి సిడాం సత్తయ్య పేరును ఉన్న అరఎకరం భూమిని కుమారుడు సిడాం రాజు పేరున విరాసత్‌ చేసి ఇస్తామని తెలిపారు.

దుస్తులు అందజేత..

మండలంలోని కల్వాడ గ్రామానికి చెందిన యువకులు స్పందించి అనాథ పిల్లలకు దుస్తులు, కూలర్‌ను అందజేశారు. అదే విధంగా మరికొంత మంది కూడా తోచిన సాయం చేస్తామని ముందుకొచ్చారు. దహెగాం మండల కేంద్రానికి చెందిన వాసవి రైస్‌మిల్లు ఆధ్వర్యంలో వంట సామగ్రి అందజేశారు. మరికొంత మంది దాతలు సాయం చేయడానికి ముందుకొచ్చారు. మంచిర్యాల జిల్లా సామగూడెం గ్రామానికి చెందిన యువకులు నిత్యావసర సరుకులు అందజేశారు. దీంతో అనాథలైన గిరిజన బిడ్డల కళ్ళల్లో వెలుగులు కనిపిస్తున్నాయి.

బాసరలో భక్తుల సందడి



భైంసా: చదువుల తల్లి బాసర శ్రీజ్ఞాన సరస్వతి ఆలయంలో శుక్రవారం భక్తుల రద్దీ నెలకొంది. గోదావరినదిలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. 683 మంది చిన్నారులకు అక్షర శ్రీకార పూజలు చేశారు. గోదావరి నది ఒడ్డున సూర్యేశ్వర స్వామి ఆలయంలో భక్తులు పూజలు చేశారు.

హామీలను విస్మరించిన టీఆర్‌ఎస్‌ ప్రభుత్వం

- ఆదిలాబాద్‌ ఎంపీ సోయం బాపూరావు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ సోయం బాపూరావు

తాంసి: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ఆదిలాబాద్‌ ఎంపీ సోయం బాపూరావు అన్నారు. ప్రజాగోస బీజేపీ భరోసా కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలో శుక్రవారం కార్నర్‌ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీ హాజరయ్యారు. అంబేద్కర్‌ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం సమావేశంలో మాట్లాడుతూ ఎన్నికల సమయంలో రాష్ట్ర ప్రభుత్వం రూ.లక్ష రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి మోసం చేసిందన్నారు. నాలుగేళ్లైనా రుణమాఫీ చేయడం లేదని మండిపడ్డారు. ఇంటికో ఉద్యోగం, నిరుద్యోగ భృతి, డబుల్‌ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం ఇలా ఏ హామీని కూడా నెరవేర్చలేదని గుర్తు చేశారు. ఇప్పటికే కేంద్రం నిధులతో జిల్లా కేంద్రంలో రైల్వే ఫిట్‌లైన్‌ పనులను మంజూరు చేసినట్లు తెలిపారు. త్వరలోనే ఆదిలాబాద్‌ నుంచి ఆర్మూర్‌ వరకు అమృత్‌ పథకంలో ప్రత్యేక రైల్వేలైన్‌కు కేంద్ర ప్రభుత్వం ద్వారా నిధుల మంజూరుకు కృషి చేస్తున్నట్లు వివరించారు. మండల కేంద్రంలో బీసీ సంఘ భవనానికి ఎంపీ నిధుల నుంచి రూ.5లక్షలు, సాయి బాబా, శివాలయంలో అభివృద్ధి పనుల కోసం రూ.10 లక్షలను మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బోథ్‌ ప్రబారి సత్యనారాయణ, జిల్లా ఉపాధ్యక్షుడు సామ సంతోష్‌ రెడ్డి, జిల్లా నాయకులు రత్నాకర్‌ రెడ్డి, రాజు యాదవ్‌, రామారావు, మండల అధ్యక్షుడు ప్రవీణ్‌ రెడ్డి, నాయకులు రాకేష్‌ యాదవ్‌, సుభాష్‌, నర్సారెడ్డి, బీసీ సంఘం మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌ గౌడ్‌ పాల్గొన్నారు.

ఫంక్షన్‌హాల్‌లో అగ్ని ప్రమాదం

- తృటిలో తప్పిన ప్రమాదం



వంటగది నుంచి ఎగిసి పడుతున్న పొగలు

సారంగపూర్‌: మండలంలోని చించోలి(బి) ఎక్స్‌ రోడ్డు వద్ద గల సూర్య గార్డెన్‌ ఫంక్షన్‌ హాల్‌లో శుక్రవారం అగ్ని ప్రమాదం సంభవించింది. ఇదే ఫంక్షన్‌ హాల్‌లో ఉదయం 11గంటలకు ఓ పెళ్లి వేడుక జరగనుండగా పెళ్లివారి బంధువులు, పెళ్లికి సంబంధించిన విందు భోజనాలు వండి పెడుతున్న సమయంలో వంటగది వైపునుంచి హఠాత్తుగా మంటలు చెలరేగాయి. ఇంతలోనే అప్రమత్తమైన పెళ్లికి హాజరైన వధూవరుల బంధువులు, ఫంక్షన్‌హాల్‌ సిబ్బంది హుటాహుటిన మంటలను ఆర్పే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. వెంటనే స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి ఫోన్‌ ద్వారా సమాచారం ఇవ్వగా వారు చేరుకుని మంటలు అదుపు చేశారు. ఈ ప్రమాదానికి కారణం తెలియరాలేదు. ఫంక్షన్‌ హాల్‌ యజమాని మాత్రం షార్ట్‌సర్క్యూట్‌ కారణమై ఉంటుందని భావిస్తున్నారు. ఇంకా కొంతమంది వంటచేసే సమయంలో నిప్పురవ్వలు ఎగిసిపడి మండలు చెలరేగాయని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రమాదం జరిగిన వెంటనే పెళ్లి వేడుకలను ఇతర ప్రాంతానికి మార్చారు.

నేత్రపర్వంగా గోవిందుడి రథోత్సవం

- ముగిసిన శ్రీవేంకటేశ్వరుడి బ్రహ్మోత్సవాలు



కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

తలమడుగు: మండలంలోని భరంపూర్‌ గ్రామ సమీపంలోని కొండపైన గల శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఆలయంలో మూడు రోజుల పాటు నిర్వహించిన బ్రహ్మోత్సవాలు శుక్రవారం ముగిశాయి. కార్యక్రమంలో భాగంగా శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో, హోమం, రథోత్సవం ఘనంగా నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్చరలతో స్వామివారికి హోమం, పూర్ణాహుతి, కల్యాణం, చక్రస్నానం గావించారు. ఉదయం నుంచి సాయత్రం వరకు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

ఘనంగా రథోత్సవం..

శ్రీవేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రథోత్సవం నిర్వహించారు. కొండ పై నుంచి శ్రీవెంకటేశ్వర స్వామిని ముస్తాబు చేసి రథంలో కిందకు తీసుకొచ్చారు. భక్తుల గోవింద నామస్మరణ మధ్య ఊరేగింపు నిర్వహించారు. రథోత్సవాన్ని తిలకించేందుకు వివిధ గ్రామాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఆలయ కమిటీ, గ్రామ కమిటీ సభ్యులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు భూమారెడ్డి, సహకార సంఘ చైర్మన్‌ ముడుపు దామోదర్‌రెడ్డి, ఎంపీటీసీలు రమేష్‌రెడ్డి, సర్పంచ్‌ భగీరథబాయి, ఆలయ కమిటీ చైర్మన్‌ కేదేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రాణం తీసిన నూర్పిడి యంత్రం

- ప్రమాదవశాత్తు వలస కూలీ మృతి



శనగ నూర్పిడి యంత్రంలో ఇరుక్కుపోయి మృతి చెందిన మనీష్‌

ముథోల్‌: ఉపాధి నిమిత్తం వచ్చిన కూలీ ప్రమాదవశాత్తు నూర్పిడి యంత్రంలో ఇరుక్కపోయి మృత్యువాత పడిన ఘటన మండలంలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్సై తిరుపతి వివరాల ప్రకారం... మధ్యప్రదేశ్‌ రాష్ట్రంలోని బెతుల్‌ జిల్లా మార్పినీ గ్రామానికి చెందిన మనీష్‌ దుర్వే(23) మండలంలోని విఠోలి గ్రామానికి చెందిన ఓ కౌలురైతు పంట పొలంలో శనిగపంట నూర్పిడి చేయడానికి శుక్రవారం ఉదయం వచ్చాడు. మధ్యాహ్న సమయంలో పంటను నూర్పిడి చేసే క్రమంలో ప్రమాదవశాత్తు అందులో ఇరుక్కపోయి మృతిచెందాడు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కల్వర్టులో కారు.. తప్పిన ప్రమాదం

మంచిర్యాలరూరల్‌(హాజీపూర్‌): హాజీపూర్‌ మండలంలోని ముల్కల్లలోని దక్కన్‌ గ్రామీణ బ్యాంక్‌ ఎదురుగా ఉన్న చిన్న కల్వర్టులో అదుపు తప్పిన ఓ కారు బోల్తా పడింది. మంచిర్యాల నుంచి హాజీపూర్‌ వైపు వెళ్తున్న కారు శుక్రవారం ఉదయం ఒక్కసారిగా అదుపు తప్పడంతో ఇరుకుగా ఉన్న రోడ్డు పక్కనే ఉన్న కల్వర్టులోకి దూసుకెళ్లి బోల్తా పడింది. కారులో ఉన్న ముగ్గురికి ఎలాంటి చిన్న గాయాలు కాక పోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది.

రైతు భరోసా దీక్షను విజయవంతం చేయండి

- ఆర్‌ఎస్‌ఎస్‌ రాష్ట్ర అధ్యక్షుడు దుర్గే మహేందర్‌



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు, రైతులు

నార్నూర్‌: రైతు సురక్ష సమితి (ఆర్‌ఎస్‌ఎస్‌) ఆధ్వర్యంలో ఈ నెల 27న ఉట్నూర్‌లోని ఆర్డీవో కార్యాలయం వద్ద చేపట్టిన రైతు భరోసా దీక్షను విజయవంతం చేయాలని ఆర్‌ఎస్‌ఎస్‌ రాష్ట్ర అధ్యక్షుడు దుర్గే మహేందర్‌ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని మారోతి పుస్కర్‌ కాంప్లెక్స్‌ వద్ద రైతు భరోసా దీక్షకు సంబంధించిన వాల్‌ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు ఆరోగ్య బీమా, రైతు పింఛన్‌, రైతు విద్యావికాస్‌, రైతు జలధార పథకాలు అమలు చేయాలని, ఏజెన్సీ ప్రాంతంలో నివాసం ఉంటున్న రైతులకు పట్టాలు, బ్యాంకు రుణాలు, రైతుబంధు, పోడు భూములు, గిట్టుబాటు ధర, దళితబస్తీ వంటి పథకాలను అమలు చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్‌ చేశారు. డిమాండ్ల సాధన కోసం రైతులు భారీగా తరలివచ్చి రైతు భరోసా దీక్షను విజయవంతం చేయాలని కోరారు. బీసీ నాయకుడు జ్ఞానో బా పుస్కర్‌, సంఘం ప్రతినిధి అరికెళ్లా అశోక్‌ ఉన్నారు.

కలెక్టరేట్‌ ఎదుట పురుగులమందు తాగిన యువకుడి మృతి

- ఈ నెల 7న ఘటన
- రిమ్స్‌లో చికిత్స పొందుతూ..



శ్రీనివాస్‌(ఫైల్‌)

ఉట్నూర్‌రూరల్‌: పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి పరిస్థితి విషమించి శుక్రవారం మృతిచెందాడు. ఎస్సై సుమన్‌భరత్‌ వివరాల ప్రకారం.. మండలంలోని శంకర్‌నాయక్‌ తాండకు చెందిన వికలాంగుడు చవాన్‌ శ్రీనివాస్‌ (24) ఉద్యోగం కోసం ఆదిలాబాద్‌ జిల్లాలోని ఎంప్లాయిమెంట్‌ అధికారి కిరణ్‌కుమారు వద్దకు వెళ్ల రూ.లక్ష ఇస్తే ఉద్యోగం ఇస్తానని తెలిపాడు. దీంతో శ్రీనివాస్‌ విడతల వారిగా రూ.లక్ష ముట్టచెప్పాడు. అయితే ఉద్యోగం కోసం అడిగితే రేపుమాపు అంటూ దాటవేస్తున్నాడు. దీంతో మనస్తాపానికి గురై ఈ నెల 7న కలెక్టరేట్‌ ఎదుట పురుగుల మందుతాగాడు. స్థానికులు రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని అశోక్‌నగర్‌ బస్తీలో తాళం వేసి ఉన్న ఓ ఇంటికి గుర్తు తెలియని వ్యక్తులు కన్నం వేశారు. బాధితుడి కథనం ప్రకారం... అశోక్‌నగర్‌ బస్తీలో నివాసముంటున్న దాసారం ఎల్లయ్య అనే రిటైర్డు ప్రిన్సిపాల్‌ కుటుంబ సభ్యులతో కలిసి రెండు రోజుల క్రితం పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలోని బంధువుల పెళ్లికి వెళ్లారు. ఎల్లయ్య కొడుకు తిరుపతి ఇంట్లో ఉండగా గురువారం ఇంటికి తాళం వేసి నైట్‌ డ్యూటీకి వెళ్లాడు. శుక్రవారం డ్యూటీ నుంచి ఇంటికి వచ్చేసరికి తలుపులు తీసి ఉన్నాయి. ఇంట్లో వెళ్లి చూసే సరికి బీరువా తాళాలు పగులగొట్టి ఉండడంతో బిత్తరపోయాడు. బీరువాలోని 5తులాల బంగారు ఆభరణాలు, 8 తులాల వెండి ఆభరణాలు, రూ.10వేల నగదు దోచుకెళ్లారు. వన్‌టౌన్‌ అదనపు ఎస్సై రాములు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



రాంనగర్‌లో..



రిమ్స్‌ ఆసుపత్రి వద్ద



న్యూ హౌసింగ్‌బోర్డు కాలనీలో

సార్లు.. జెర స్పందించరూ

జిల్లా కేంద్రంలో కుక్కల బెడదతో జనం బెంబేలెత్తుతున్నారు. ప్రతీ కాలనీలో ఇవి గుంపులు గుంపులుగా స్వైర విహారం చేస్తున్నాయి. రహదారి వెంట వెళ్తున్న వారిపై దాడులకు పాల్పడి గాయపరుస్తున్నాయి. హైదరాబాద్‌లో తాజాగా ఓ చిన్నారిని వీధి కుక్కలు బలి తీసుకున్న ఘటన నేపథ్యంలో జిల్లాలో సంబంధిత అధికారులు స్పందించాలని పలువురు కోరుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్‌, ఆదిలాబాద్‌